క్లుప్తంగా

నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: కాంగ్రెస్ నాయకులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం రాత్రి పాలకుర్తి మండలంలోని 13 గ్రామాల పార్టీ అధ్యక్షులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో వీధి దీపాలతో పాటు అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ ఆలయంలో పూజలు



జెండావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ఎల్లమ్మ చెరువుకట్ట సమీపంలో గల కట్ట మైసమ్మ తల్లి ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే విజయరమణారావు మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్య ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయం ఎదుట దుర్గామాత పతాకాన్ని ఆవిష్కరించారు. ఆలయ అభివృద్ధికి నిధులివ్వాలని ఆలయ కమిటీ నిర్వాహకులు బొడ్డుపల్లి శ్రీనివాస్, గండు రంగయ్య, పోతని పురుషోత్తం, బూతగడ్డ సంపత్, జగదీశ్, చంద్రగిరి రవి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మల్లయ్య, శ్రీకాంత్, అశోక్, సంపత్, శ్రీమాన్, చంద్రశేఖర్, వెంకటేశం, శ్రీనివాస్, మారయ్య పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం నూతన కమిటీ నియామకం



నూతన కమిటీని సన్మానిస్తున్న సభ్యులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ పద్మశాలీ సేవా సంఘం నూతన కమిటీ నియామకం బుధవారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా ఆడెపు రాజేశం, ప్రధాన కార్యదర్శిగా మానాల ప్రభాకర్, కోశాధికారిగా బూర్ల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారిని సన్మానించారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా చిన్ననాటి స్నేహితులు



సరితతో చిన్ననాటి మిత్రులు

గోదావరిఖనిటౌన్: నగరంలోని పరశురాంనగర్‌కు చెందిన కుక్క సరిత భర్త సురేశ్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. నగరంలోని విద్యానగర్‌లో గల శ్రీరామ విద్యాలయంలో 2000లో సరితతో పాటు 10వ తరగతి చదివిన చిన్ననాటి మిత్రులు కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ఆమె ఇంటికి వచ్చి శుక్రవారం రూ.30వేలు అందించారు.

వైద్యసిబ్బంది స్థానికంగా ఉండాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో పనిచేస్తున్న సిబ్బంది స్థానికంగా ఉంటూ వైద్య సేవలందించాలని బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య కోసం వెళ్లిన వారికి సిరంజీలు, ఐవీ క్యాన్లు బయట నుంచి తెచ్చుకోవాలని చిట్టీలపై రాసిస్తున్నారని ఆరోపించారు. అధికారులు తనిఖీ చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు గుర్రం లక్ష్మిమల్లు, నీలం శ్రీనివాస్, తోట రాజ్‌కుమార్ ఉన్నారు.



గోదావరిఖని: అవగాహన కల్పిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి



యైటింక్లయిన్‌కాలనీ: ఆయుధాల పనితీరును వివరిస్తున్న సీఐ, ఎస్సైలు

పోలీస్‌స్టేషన్లలో ఓపెన్‌హౌస్

గోదావరిఖని: పోలీసు సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గోదావరిఖని వన్‌టౌన్‌లో బుధవారం ఓపెన్‌హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ విధులు, సిబ్బంది పనితీరు, తదితర విషయాలను సీఐ ఇంద్రసేనారెడ్డి వివరించారు. స్థానిక కాకతీయ, గాంధీ జూనియర్ కళాశాలల విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలి

యైటింక్లయిన్‌కాలనీ: క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలని గోదావరిఖని టూటౌన్ సీఐ ఎస్.ప్రసాద్‌రావు విద్యార్థులకు సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా బుధవారం యైటింక్లయిన్‌కాలనీ స్పందన మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పోలీస్‌స్టేషన్లో ఉన్న ఆయుధాల గురించి సీఐ వివరించారు. ఎస్సైలు వెంకటకృష్ణ, సోనియా, హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది భార్గవ్, కనకయ్య, రాజయ్య, పాఠశాల కరస్పాండెంట్ ఓదెలుయాదవ్, హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అంతర్గాం పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ నిర్వహించారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అంతర్గాం ఎస్సై బోయ వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్సై స్వామి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది, యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై జి.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం ఓపెన్‌హౌస్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయుధాల గురించి వివరించారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయుధాల వినియోగం, చట్టాలపై పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై వెంకటేశ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందుంచుతా..



బీటీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: అభివృద్ధిలో పెద్దపల్లి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల నుంచి లాలపల్లి వరకు 2.40కోట్ల సీఆర్‌ఆర్ నిధులతో బీటీ డబుల్‌రోడ్డు, లాలపల్లి నుంచి పెద్దాపూర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు రూ.కోటి 60లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం, లాలపల్లిలోని బీరన్న ఆలయం ప్రహరీ నిర్మాణానికి రూ.10లక్షలు, గ్రామంలోని సీసీరోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలతో ఎమ్మెల్యే విజయరమణారావు బుధవారం శంకుస్థాపన చేశారు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగానే కొద్దిరోజుల్లోనే ఎలిగేడు మండలానికి పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తానన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, మాజీ సర్పంచులు బాలుసాని పర్శరాములుగౌడ్, వెంకటేశ్వర్‌రావు, మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, నాయకులు బూర్ల వెంకటసత్యం, పెద్ది కుమార్, బాసంపల్లి కొండయ్య, గొల్లె భూమేశ్, పుల్లారావు పాల్గొన్నారు.

కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

ఓదెల: ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి కటింగ్ లేకుండా కొనుగోళ్లు చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ఆదేశించారు. మండలంలోని గుంపుల, పొత్కపల్లి, ఓదెల గ్రామాల్లో ఐకేపీ సొసైటీ కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లో రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రైతులకు కనీసం సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పొత్కపల్లి విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, సీఈవో గోళి అంజిరెడ్డి, ఏపీఎం లతమంగేశ్వరి, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ వైస్ ఎంపీపీ పిట్టల రవికుమార్, చింతిరెడ్డి విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న డీపీవో రవీందర్

మంథని: గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికకు అర్హులందరూ గడువులోగా ఓటు నమోదు చేసుకోవాలని డివిజనల్ పరిపాలన అధికారి తూము రవీందర్ కోరారు. బుధవారం రాజకీయ పార్టీలతో ఆయన సమావేశయ్యారు. ఓటు నమోదు గడువుపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఆయా మండలాల తహసీల్దార్లు, పార్టీల నాయకులు అజీంఖాన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

ఓసీపీ-1 ఉద్యోగుల పనితీరుకు దక్కిన గౌరవం



ఇస్మాయిల్

యైటింక్లయిన్‌కాలనీ: ఓసీపీ-1 ప్రాజెక్ట్ ప్రతిష్టాత్మకమైన ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడం అందులో పనిచేస్తున్న ఉద్యోగుల పనితీరుకు దక్కిన గౌరవమని హిందూ మజ్దూర్ సభ (హెచ్‌ఎంఎస్) నేత క్యాజీ ముహమ్మద్ ఇస్మాయిల్ అన్నారు. అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనిచేయడంతోనే అవార్డు లభించిందన్నారు. ఫైవ్ స్టార్ అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ అందులో తను కూడా పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేరాల నియంత్రణకే కార్డెన్‌సెర్చ్



మాట్లాడుతున్న మంథని సీఐ రాజుగౌడ్

రామగిరి: నేరాల నియంత్రణకే గ్రామాల్లో కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు మంథని సీఐ బి.రాజుగౌడ్ అన్నారు. మండలంలోని కల్వచర్లలో బుధవారం ఎస్సై పెట్టం చంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డెన్‌సెర్చ్‌లో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ఒకవేళ ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డయల్ 100పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930కి డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో మంథని, ముత్తారం ఎస్సైలు రమేశ్, నరేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలపై మంత్రికి వినతి



వినతిపత్రం ఇస్తున్న క్రాంతికుమార్

మంథని: మత్స్యకారుల సమస్యలపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించినట్లు మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ పోతరవేన క్రాంతి కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని మత్స్యకారులకు న్యాయం జరిగేలా చూడాలని కోరినట్లు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్, మార్కెట్ చైర్మన్లు

ధర్మారం: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ కోరారు. ధర్మారం మండలంలోని సాయంపేట, బొట్లవనపర్తి, బుచ్చయ్యపల్లి, నర్సింహులపల్లి, కానంపెల్లి, పైడిచింతలపల్లి గ్రామాల్లో బుధవారం మేడారం సింగిల్‌విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డితో కలిసి చైర్మన్ ప్రారంభించారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందని వారు తెలిపారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ రాయమల్లు, మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాంపెల్లి రాజేశం, రాజు పాల్గొన్నారు.

రింగ్‌రోడ్డు కోసం నిధుల మంజూరుపై హర్షం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వెన్నంపల్లి గ్రామ రింగ్ రోడ్డుకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావురూ.7కోట్లు మంజూరు చేయించినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో బుధవారం స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు గజానవేన సదయ్య, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే ఫ్లైఓవర్ వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయండి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి నుంచి మంథని వెళ్లే మార్గంలో రైల్వే వంతెన వద్ద ఎల్‌ఈడీ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు కిషన్‌జీ, నూగిల్ల వీరేశం, మోహన్‌యాదవ్, గడ్డం శేఖర్ కోరారు. మున్సిపల్ అధికారులను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికే ఎందరో ప్రాణాలు పోగొట్టుకున్నారని తెలిపారు. వీలైనంత త్వరగా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నియంత్రించాలని వారు కోరారు.

సంక్షిప్త వార్తలు

• ఉచిత వైద్య శిబిరానికి స్పందన

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శ్రీవాణి కళాశాల కాంప్లెక్స్‌లోని కాలనీవాసులకు బుధవారం ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. రక్త పరీక్షలతో పాటు ఐసీటీసీ పరీక్షలు నిర్వహించారు. బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. బీపీ షుగర్, ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ గర్రెపల్లి మెడికల్ ఆఫీసర్ డా.అనుదీప్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో డా.సింధూజ, కాలేజీ ప్రిన్సిపాల్ కమలాకర్ సూపర్‌వైజర్ వెంకటరెడ్డి, ఏఎన్‌ఎం సరస్వతి, ల్యాబ్ టెక్నీషియన్ గౌస్, ఆశాలు రమాదేవి, స్వప్న పాల్గొన్నారు.

• ఎలిగేడులో వైద్యశిబిరం

ఎలిగేడు: మండల కేంద్రంలో బుధవారం పద్మపాణి సొసైటీ లింక్‌వర్కర్ కవ్వంపల్లి సంపత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా, పంచాయతీ కార్యదర్శి అంజలి, సీహెచ్‌వో విజయేందర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మన్, నాగమణి, ఏఎన్‌ఎం దేవేంద్ర, ఆశావర్కర్లు కవ్వంపల్లి శారద, కొప్పుల పద్మ, జోనల్ సూపర్‌వైజర్ లక్ష్మన్ పాల్గొన్నారు.

• చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయండి

మంథని: మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యల సాధనకు ఈ నెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ తెలిపారు. మంథని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కార్మికులు సమావేశమయ్యారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి కార్మికులు తరలిరావాలని కోరారు.

• రైతుబంధు ఇప్పించండి

పెద్దపల్లిరూరల్: పంటసాగు చేసే రైతులకు పెట్టుబడి సాయంగా రైతుబంధు పథకం కింద ఎకరాకు రూ.10వేలు అందిస్తామన్న పాలకులు వెంటనే ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆర్డీవో గంగయ్యను కలిసి వినతిపత్రం అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అసెంబ్లీ ఇన్‌చార్జి దాడి సంతోష్, పట్టణ, మండల అధ్యక్షులు రాజగోపాల్, మేకల శ్రీనివాస్, మహంత, వంశీ, సతీశ్, శ్రీధర్, కుమార్, రాజేశం, చంద్రమౌళి, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

• గీతకార్మికుల సమస్య పరిష్కారానికి కృషిచేస్తా

సుల్తానాబాద్: గీతకార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ అన్నారు. సర్వాయి పాపన్న గీతకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి పర్శరాములుగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు అన్నయ్యగౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. వ్యవస్థాపక సభ్యులు సారయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు పడాల కొమురయ్య, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకరయ్య, గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

• నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి స్వప్నరాణి తెలిపారు.



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల సమీపంలో రోడ్డు అధ్వానంగా మారింది. గుంతలు పడి వాన కురిసినపుడు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పంచాయతీ అధికారులు దృష్టిసారించి గుంతలు పూడ్చి ప్రజల ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మా ఫోన్ నంబర్: 98499 71500

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

సింగరేణి వార్తలు

ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దాలి



సమావేశంలో జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: సమష్టిగా ముందుకు సాగి ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దాలని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ సూచించారు. జీడీకే-11వ గనిలో బుధవారం ఏర్పాటు చేసిన మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ అభివృద్ధిలో ప్రతీఒక్కరు భాగస్వాములై విలువైన సలహాలు ఇవ్వాలని కోరారు. నెలల వారీగా నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆదేశించారు. బొగ్గు నాణ్యత ప్రమాణాలు మెరుగు పర్చేందుకు చేపట్టాల్సిన ప్రణాళికలు, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. ఏజెంట్ చిలుక శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు కె.స్వామి, గని మేనేజర్ మల్లేశం, ఏరియా ఇంజినీర్ రాందాస్, ఆంజనేయులు, రాజన్న, రవీందర్‌రెడ్డి, సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు ప్రత్యేక శిక్షణ



మాట్లాడుతున్న గుర్తింపు సంఘం అధ్యక్షులు

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులకు శిక్షణ కార్యక్రమం హైదరాబాద్‌లో బుధవారం ప్రారంభమయ్యాయి. సింగరేణి యాజమాన్యం, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 26వరకు కొనసాగనున్నాయి. శిక్షణ కార్యక్రమాల్లో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ప్రారంభోపన్యాసం ఇచ్చారు. ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకులు ఎల్.ప్రకాశ్, వైవీరావు, మడ్డి ఎల్లాగౌడ్, కూసన వీరభద్రం, వంగ వెంకట్, ఆరెల్లి పోషం, జీగురు రవీందర్, ఎం.రాంచంద్రారెడ్డి, భాజీసైదా, కె.మల్లికార్జున్ పాల్గొన్నారు. జీఎం సుభాని, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం..

- దారి మూసివేయడంతో ఇబ్బందుల్లో ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మికులు



రోడ్డుకి అడ్డంగా ముళ్లపొదలు

ఫెర్టిలైజర్‌సిటీ రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం కొత్తగేట్ నుంచి యైటింక్లయిన్ కాలనీకి వెళ్లే లక్ష్మీపురం రైల్వే గేట్ వరకు రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ ముందస్తు సమాచారం లేకుండా రోడ్డు మూసివేయడంతో ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారి మూసివేసిన విషయాన్ని గమనించక కార్మికులు రావడంతో విధులకు సకాలంలో హాజరు కాలేకపోయారు. అధికారులు స్పందించి కార్మికుల కోసం లక్ష్మీపురం చెరువు కట్టపైన రోడ్డును అందుబాటులోకి తేవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతాం



కార్మికులతో మాట్లాడుతున్న గౌస్

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందని కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆర్జీ-1 అధ్యక్షుడు గౌస్ అన్నారు. సింగరేణి ఆర్జీ వన్ సెక్టార్ వన్ పరిధిలోని ఇ, ఎఫ్ జోన్లలో పనిచేస్తున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులను బుధవారం కలిసి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా రూ.5వేలు ఇప్పించామన్నారు. భవిష్యత్‌లో నిర్వహించే పోరాటాలకు కాంట్రాక్ట్ కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్టు కార్మికులు సుధాకర్‌రెడ్డి, మంగ, సుజాత, సుశీల, మధు, ప్రసాద్ పాల్గొన్నారు.

రెండునెలల వేతనాలు ఇప్పించండి



వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

గోదావరిఖని: కోల్ శాంప్లింగ్ కార్మికులకు రెండు నెలల వేతనాలు ఇప్పించాలని బుధవారం రామగుండం రీజియన్ క్వాలిటీ జీఎం భైద్యాను కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణి సంస్థ నుంచి థర్డ్ పార్టీ శాంప్లింగ్ టెండర్ పొందిన ప్రభుత్వ రంగ సంస్థ ఈపీటీఆర్‌ఐ నుంచి కేసీఎస్ సబ్ కాంట్రాక్టు పొందిందని వారు తెలిపారు. ఈ సంస్థ థర్డ్ పార్టీ శాంప్లింగ్ నిర్వహణ చేపట్టిందని, మార్చిలో వేతనాలు పూర్తి స్థాయిలో చెల్లించిందని, ఏప్రిల్, మే నెలల్లో జీతాలు చెల్లించలేదని పేర్కొన్నారు. రెండు నెలల వేతనాలు ఇప్పించేలా చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని కోరారు. కార్మికులు గుండబోయిన భూమయ్య, కొమురవెల్లి విశ్వనాథ్, పనగంటి అశోక్, లక్ష్మణ్, సతీశ్, శ్రీనివాస్ ఉన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభిస్తారని ఉన్నత శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.